క్లుప్తంగా

ఘనంగా కొల్లాపురమ్మ జాతర



జాతరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమా తదితరులు

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండల పరిధిలోని గూళ్యంలో మంగళవారం కొల్లాపురమ్మ జాతర ఘనంగా జరిగింది. జాతరకు వైఎస్సార్‌సీపీ నేతలు మాదినేని ఉమామహేశ్వరనాయుడు, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, స్థానిక నాయకులు హాజరయ్యారు. అనంతరం నాయకులు కొల్లాపురమ్మ అమ్మవారిని దర్శించుకుని, విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంబదూరు మండల కన్వీనర్ హనుమంతు, కళ్యాణదుర్గం జెడ్పీటీసీ బొమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాయుడు, జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి తలారి సత్తి, డాక్టర్ల విభాగం అధ్యక్షుడు బొమ్మయ్య, జిల్లా కార్యదర్శి ఆనంద్, సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు భీమేష్, రఘు, పాతలింగ, ఆదిమూలం మంజు, వేలూరు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉరవకొండ (వజ్రకరూరు) : ఆర్‌డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని వజ్రకరూరు తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలియజేశారు. మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకబాల రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ నాయకులు రవీంద్రబాబు, శ్యాంప్రసాద్ మాట్లాడారు. కరువు పీడిత అనంతపురం జిల్లాలో దాదాపు దశాబ్దాలుగా పేదలకు ఆర్డీటీ విద్య, వైద్యం, పక్కాగృహాలు, అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. ఇలాంటి తరుణంలో ఆర్‌డీటీకి వచ్చే విదేశీ ఫండ్స్‌ను ఆపడం సరికాదన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం



రాగులపాడులో ఆలయ భూముల కౌలుకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరు మండల పరిధిలోని రాగులపాడులో వెలసిన శ్రీరామేశ్వర, ఆంజనేయస్వామి, అహోబిలేశ్వరస్వామి ఆలయాల భూములను కౌలుకు సాగు చేసుకోవడానికి వేలం పాట మంగళవారం నిర్వహించారు. యాడికి కార్యనిర్వాహక కార్యదర్శి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన వేలంలో మూడు ఆలయాలకు సంబంధించి 45.51 ఎకరాల భూమిని బహిరంగ వేలం వేయగా మొత్తం 3,40,500 వచ్చింది. గతేడాది ఈభూములకు నిర్వహించిన వేలంలో రూ.1,59,000 ఆదాయం వచ్చిందని, ఈఏడాది వేలం ద్వారా రూ.1.18 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మే 1 నుంచి 2026 మార్చి 31 వరకు కౌలు హక్కులు ఉంటాయన్నారు.

కంటి వైద్య సేవలు ప్రారంభం



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ సర్జన్ సుహాసిని యాదవ్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏరియా ప్రభుత్వాస్పత్రిలో దాదాపు 8 నెలల తర్వాత కంటి వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సెప్టెంబర్ నెల నుంచి కంటి వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. అప్పట్లో సెంటర్‌లో ఉన్న మిషన్లు, కంప్యూటర్లను ఒప్పందం మేరకు ప్రైవేట్ ఏజెన్సీ సిబ్బంది తీసుకెళ్లారు. మూడు నెలల నుంచి ఏరియా ఆస్పత్రిలో ఆప్తాల్మిక్ సర్జన్ సుహాసిని యాదవ్ సేవలందిస్తున్నారు. కానీ ఈవ కేంద్రంలో సరైన పరికరాలు లేక కంటి వైద్య సేవలు అందలేదు. పది రోజుల క్రితం ఏరియా ఆస్పత్రికి అవసరమైన స్లిట్ ల్యాంప్, ఏఆర్ యంత్రాలు రావడంతో వైద్య సేవలు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉచితంగా కళ్లద్దాలు అందించేవారు. ప్రస్తుతం కంటి వైద్యపరీక్షలు చేస్తున్నా కళ్లద్దాలు పంపిణీ చేయడంలేదు.

ఆటో డ్రైవర్ బలవన్మరణం

బ్రహ్మసముద్రం: అప్పుల బాధ తాళలేక ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు..బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లికి చెందిన యల్లప్ప(46)కు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఇంటి అవసరాలకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి తీర్చలేని స్థాయికి చేరుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన యల్లప్ప మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జలం కాదు..గరళం

- డ్రైయినేజీల్లోనే వెళ్లిన తాగునీటి సరఫరా పైపులైన్లు
- బూడిద రంగు నీరు సరఫరా
- నీరు వదిలాక గంటకు పైగా దుర్వాసన
- ఈ నీరు తాగి రోగాలబారిన పడుతున్న జనం
- పైపులైన్లు పక్కకు మార్చాలంటున్న ప్రజలు

రాయదుర్గంలోని పలు వార్డుల్లోని ప్రజలు నీరు కాదు.. గరళం తాగాల్సి వస్తోంది. తాగునీటి సరఫరా అయ్యే పైప్‌లైన్లు చాలా చోట్ల మురుగు కాలువల్లోనే వెళ్లడమే ఇందుకు కారణం. వందల మీటర్ల మేర పైపులైన్లు మురుగునీటిలోనే ఉన్నాయి. దీంతో లీకేజీల కారణంగా కొన్ని సార్లు కొళాయిల ద్వారా బూడిద రంగు నీరు సరఫరా అవుతోంది. ఈ నీరు తాగుతూ చాలా మంది రోగాలబారిన పడుతున్నారు. డ్రైనేజీల కింద, పక్కనే ఆనుకొని వెళ్లిన పైపులైన్లను మార్చి, శుద్ధి జలం సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు తాగునీటి సరఫరాలో అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి..లేకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు.



28వ వార్డులో డ్రైనేజీ కింద ఏర్పాటుచేసిన పైప్‌లైన్‌కు అమర్చిన కుళాయి



26వ వార్డులో డ్రైనేజీ లోపల నుంచి తీసుకున్న పైప్‌లైన్లు



27వ వార్డులో ప్రధాన కాలువలో పైప్‌లైన్లు ఇలా..

రాయదుర్గం: పురపాలక సంఘం పరిధిలోని 32 వార్డులు 75 వేల మంది జనాభా ఉన్నారు. వీరి అవసరాలకు తగ్గట్టుగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శాశ్వత తాగునీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. తుంగభద్ర ద్వారా విడుదలయ్యే జలాలను కణేకల్లు వద్ద సమ్మర్ స్టోరేజీలో నిల్వచేసి, శుద్ధిచేశాక ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేలా కృషి చేశారు. దీనికి తోడు 65 పవర్ బోర్లు, 5 చేతి బోర్లు ఉన్నాయి. ఈ నీటిని ఆయా కాలనీల్లోని ప్రజలకు సరఫరా చేసేందుకు సుమారు 100 కిలో మీటర్లు పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 11,298 వ్యక్తిగత కుళాయిలు, 150 వీధి కుళాయిల నుంచి ప్రజలు నీటిని వినియోగించుకుంటున్నారు. ఈ కొళాయిలకు అనుసంధానమైన పైపుల్లో దాదాపు ఆయా కాలనీల్లో 20 కిలో మీటర్లకు పైగా మురుగునీటిలోనే దర్శనమిస్తున్నాయి. బళ్లారి రోడ్డులోని నీలకంఠేశ్వరుడి ఆలయం వెనుకభాగాన 26, 27, 28 వార్డుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గద్వాల యల్లమ్మ ఆలయం నుంచి ఒట్లకుంట పెద్ద బ్రిడ్జి వరకు డ్రైనేజీ కింద వెళ్లిన పైప్‌లైన్‌లో లీకేజీలు దర్శనమిస్తున్నాయి. అలాగే అంబేడ్కర్ కాలనీ, కోట, నేసేపేట, మధు థియేటర్, రామస్వామి, కొలిమి వీధుల్లోనూ అక్కడక్కడ లీకేజీలు కనిపిస్తున్నట్టు ప్రజలు చెప్తున్నారు. వీటిని గుర్తించడం సాధ్యం కావడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను ఓ కొలిక్కి తెచ్చారు. ఎస్టిమేట్లు సిద్ధం చేసి, నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపారు. ఇంతలోనే సార్వత్రిక ఎన్నికలు రావడం.. ఆతర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో సమస్య అలాగే ఉండిపోయింది. ప్రజల గొంతుకై ఆయా వార్డుల కౌన్సిలర్లు పలు సమావేశాల్లోనూ గట్టిగా గళం వినిపిస్తున్నా.. పరిష్కారం కాలేదు.

ఈ ప్రాంతాల్లోనే నీరు కలుషితమవుతోంది..

- పట్టణంలోని బళ్లారి రోడ్డుకు పైభాగాన 26, 27, 28 వార్డులను అనుసంధానం చేస్తూ గద్వాల యల్లమ్మ ఆలయం నుంచి వట్లకుంట పెద్ద బ్రిడ్జి వరకు పైప్‌లైన్లు ప్రధాన డ్రైనేజీ కింద వెళ్లాయి. పైప్‌లైన్ వేశాక దానిపై డ్రైనేజీ నిర్మించారు. దీంతో చాలాచోట్ల లీకేజీలు ఏర్పడి, నీరు కలుషితమవుతోంది. నిత్యం మురుగు నీరు నిండుగా ప్రవహిస్తుండడంతో లీకేజీలను అధికారులు గుర్తించలేక పోతున్నారు.
- పట్టణంలోని భంభంస్వామి ఆలయానికెళ్లే దారిలో ఎల్ఐసీ అధికారి నివాసం పక్కన కాలనీకి వెళ్లే పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. డ్రైనేజీలోని నీరు అందులో కలుషితమై కుళాయిలకు వస్తోందని ఆ కాలనీలోని ప్రజలు వాపోతున్నారు. ఇలా ఈ రెండు చోట్లే కాదు పట్టణ వ్యాప్తంగా పలు వార్డులోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీల కింద, పక్కనే ఆనుకుని వెళ్లే పైప్‌లైన్లను మార్చి శుద్ధజలం అందించాల్సిన అవసరం ఉంది. నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

తాగునీటి సరఫరాలో అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. హెడ్ వద్ద 2 పీపీఎం ఉండాలి. వీధుల్లో చివరి కుళాయి వద్ద పరీక్షిస్తే పాయింట్ 5 పీపీఎం తగ్గకూడదు. ఫిల్టరేట్ ప్లాంట్ వద్ద నీరు శుభ్రం చేయడానికి ఆలం, క్లోరిన్ ఉపయోగిస్తున్నారు. ఈ ప్రక్రియ ప్రమాణాల మేరకు జరిగేలా మెరుగుపరచాలి. సచివాలయ సిబ్బంది వారి ప్రాంతాల్లో రోజూ నీటి నమూనాలు పరీక్షించి వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. పట్టణంలో సమయమంటూ లేకుండా రాత్రి 10 గంటల తర్వాత కూడా కొన్ని కాలనీలకు నీరు విడుదల చేసిన సందర్భాలున్నాయి. ఆ సమయాల్లో నీటి పరీక్ష ఊసే ఉండడం లేదు.

రాయదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని తాగునీటి పథకాలు - నీటి సరఫరా వివరాలు	
వార్డులు	32
జనాభా	75 వేలు
తాగునీటి పథకం	వైఎస్సార్ నీటి పథకం
పవర్ బోర్లు	65
చేతి బోర్లు	5
వ్యక్తిగత కుళాయిలు	11,298
వీధి కుళాయిలు	150
రోజూ నీటి సరఫరా	9 ఎంఎల్‌డీలు
పంపిణీ లైన్లు	100 కిలో మీటర్లు

కలుషితం కాకుండా చూడాలి



తాగునీరు కలుషితం కాకుండా చూడాలి. కుళాయిలకు గంటన్నర పాటు నీరు విడుదల చేస్తే గంట సేపు భయటకు విడుదల చేయాల్సి వస్తోంది. లేకపోతే వాటి వల్ల దుర్వాసన వస్తోంది. వర్షాలు వస్తే డ్రైనేజీలు నిండుగా పారుతుంటాయి. ఆ సమయంలో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– పర్వీన్‌బాను, 27వ వార్డు, రాయదుర్గం

కౌన్సిల్ సమావేశంలో చర్చించాం



పట్టణంలోని 26, 27, 28 వార్డుల్లో తాగునీటి పైప్‌లైన్లు డ్రైనేజీలో వెళ్లాయి. దీంతో కలుషితం అవుతున్నట్టు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. గద్వాల యల్లమ్మ ఆలయం వెనుక నుంచి ఒట్లకుంట పెద్ద బ్రిడ్జి వరకు సుమారు 500ల మీటర్లు కొత్త పైప్‌లైన్ వేస్తేనే శాశ్వత పరిష్కారం సాధ్యం. అధికారులు ఈ దిశగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి, నిధులు సమకూర్చాల్సిన అవసరం ఉంది.

– పొరాళ్ల గోవిందరాజులు, 28వ వార్డు కౌన్సిలర్

శుద్ధ జలం అందిస్తున్నాం

నీరు కలుషితమన్నమాట కేవలం అపోహ మాత్రమే. ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరందించేలా కృషి చేస్తున్నాం. ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చూపడం లేదు. సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నీటి శుద్ధి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. 26 ,27, 28 వార్డుల్లో కొన్నిచోట్ల పాత పైపులు కాలువల్లో, పక్కన ఉన్నట్టు గుర్తించాం. ముందస్తు జాగ్రత్తగా కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపింపాం. రూ.5 నుంచి రూ.10 లక్షల్లోపు నిధులు సమకూరితే ఆ పనులు పూర్తిచేయొచ్చు. త్వరలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

రామాలయంలో ప్రత్యేక పూజలు

కణేకల్లు: మండలంలోని సొల్లాపురంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో వేదపండితులు మంగళవారం శాస్త్రోక్తంగా హోమాలు, పూజలు నిర్వహించారు. గణపతి హోమం, దీక్షాహోమం, ప్రాతంకాల పూజ, నవగ్రహవాస్తు హోమలు జరిగాయి. ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, సర్పంచు భాస్కర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాకెట్ల ఆశోక్, ప్రకాష్‌రెడ్డి, కణేకుర్తి జయరామిరెడ్డి, జగన్నాథరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి, నాగిరెడ్డి, ఆలేరి కాంతరెడ్డి, గోవర్దన్ రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి

తీగ జాతి పంటలు లాభదాయకం



మాట్లాడుతున్న ఏడీఏ రవి

కూడేరు: ఉలువ, అలసంద, చిక్కుడు, పెసలు తదితర తీగజాతి పంటల సాగుతో లాభదాయకమని అనంతపురం డివిజన్ అగ్రికల్చర్ ఏడీ రవి తెలిపారు. మంగళవారం ఆయన కూడేరులోని వ్యవసాయ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీగజాతి, ఇతర పంటలు సాగు చేసు కోవాలన్నారు. పంట మార్పిడితో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. ఈవిషయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండలానికి 670 భూసార పరీక్షలు చేసేలా టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. మే 15 లోపు టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వీఏఏ రాజ్‌కుమార్, వీహెచ్ఏ సాజియా, సిబ్బంది పాల్గొన్నారు.

కామధేను వాహనంపై శ్రీవారు



కామధేనువాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారు కామధేను వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయం భక్తులతో గోవిందనామస్మరంతో మార్మోగింది. శ్రీనివాసుడికి వేదమంత్రోచ్చారణ తో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సతీసమేతంగా శ్రీనివాసుడిని కామధేను వాహనంపై కూర్చోబెట్టి ఆలయం నుంచి ప్రధాన రహదారిపై గోవింద..గోవిందా అంటూ భక్తులు ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సమ్మర్ క్యాంపులు పకడ్బందీగా నిర్వహించాలి

కణేకల్లు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మే 2 నుంచి జూన్ 10 వరకు వరకు సమ్మర్ స్పెషల్ క్యాంపులు పకడ్బాందీగా నిర్వహించాలని కణేకల్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సెక్టార్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. కిశోర్ బాలికలను మానసికంగా తీర్చిదిద్దడం కోసం సమ్మర్ స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపు ముగిసేలోపు 12 సెషన్స్ జరపాలన్నారు. మే 2 బాలికల పరస్పర పరిచయం, వారి లక్ష్యాలు అడగటం, 6న రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ, ఆరోగ్య పరిరక్షణ, మే 9న బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. గ్రామ మహిళా సంరక్షక కార్యదర్శితోపాటు ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు, గ్రామైక్య సంఘాల లీడర్లు, ఆశ వర్కర్ల సమన్వయంతో చేసుకుంటూ సెషన్స్ నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కనుల పండువగా అక్కదేవతల జాతర



ప్రత్యేక అలంకరణలో ఏటి వద్ద అక్కమ్మ దేవతలు

కూడేరు: పి.నారాయణపురంలో అక్కదేవతల జాతరను గ్రామస్తులు కనుల పండువగా జరుపుకుంటున్నారు. జాతరలో భాగంగా మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న ఏటి వద్ద అక్కమ్మ దేవతల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గంపల్లో ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఉన్న అక్కమ్మ దేవతల ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

బాల్య వివాహాలతో అనర్థాలు

కళ్యాణదుర్గం రూరల్: బాల్య వివాహాలతో అనర్థాలని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కమిషన్ వంశీ తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషన్ వంశీ మాట్లాడుతూ సమ్మర్ స్పెషల్ క్యాంపులను క్షేత్ర స్థాయిలో నిర్వహించాలన్నారు. క్షేత్ర స్థాయిలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత విలేజ్ లెవెల్, వార్డు లెవెల్ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో అర్బన్ మహిళ సంరక్షణ కార్యదర్శులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

నేడు ఏపీ పాలిసెట్

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ -2025 బుధవారం నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జ్ఞాన భారతి జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (బోరంపల్లి) కేంద్రాల్లో పాలిసెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంటకు పూర్తవుతుందన్నారు. పరీక్షల హాలుకు గంట ముందే విద్యార్థులు చేరుకోవాలన్నారు. నిమిషం అలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతి ఉండదన్నారు.

అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి సర్కారు

రాయదుర్గంటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలవారినీ మోసం చేసిందని బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ విమర్శించారు. ఆయన మంగళవారం స్థానిక బీసీవై రాయదుర్గం అధ్యక్షుడు గౌని ప్రతాప్‌రెడ్డి స్వగృహంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేవలం అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోపిడీ, అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శించారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేని స్థితిలో కూటమి సర్కారు ఉందన్నారు. కార్యక్రమంలో బీసీవై నాయకులు రమేష్, పవన్, వరప్రసాద్, సాంబమూర్తి, సురేష్, హనుమంతయాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సివిల్ అసిస్టెంట్ సర్జన్ గైనిక్‌గా శివానీ నియామకం



ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరు మండలం కొనకొండ్ల సీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గైనిక్‌గా డి.శివానీ నియమితులయ్యారు. గుంతకల్లు ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం మంగళవారం ఆమె మాట్లాడారు. అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. ఆస్పత్రిలో కాన్పులు, మహిళల సమస్యలపై సలహాలు, సూచనలు పొందొచ్చన్నారు. కొనకొండ్లలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

7న మండల సర్వసభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో వచ్చేనెల 7న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుల్లాయి స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన రంగస్వామి

బెళుగుప్ప : మండలంలోని రామసాగరం తగ్గుపర్తి గ్రామాల మధ్య మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగస్వామి అనే వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. కూడేరు మండలం ముద్దలాపురానికి చెందిన విద్యుత్‌శాఖ లైన్‌మెన్ రంగస్వామి బెళుగుప్ప మండలంలోని అత్తగారి ఊరు అయిన శీర్పికి వెళ్తూ రామసాగరం సమీపంలోని హంద్రీనీవా పిల్ల కాలువ వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. పోలీసులు అతన్ని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి పంపారు.

కారు బోల్తా ... వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని ఐదుకల్లు రోడ్డు చెరువు సమీపంలో కారు బోల్తా పడి హేమంత్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. బ్రహ్మసముద్రం మండలం భైరవసముద్రం నుంచి కళ్యాణదుర్గం వైపు వస్తుండగా కారు బోల్తా పడింది.

వైఎస్ జగన్‌ను కలిసిన మెట్టు విశ్వ



జగన్‌తో మాట్లాడుతున్న మెట్టు విశ్వ

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా రాయదుర్గంలో పార్టీ పరిస్థితులపై జగన్ దృష్టికి తీసుకెళ్లినట్టు విశ్వ తెలియజేశారు. ఇటీవల పార్టీ నాయకులు, కార్యకర్తలపై నమోదవుతున్న అక్రమ కేసులపైనా తెలియజేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పార్టీని క్షేత్రస్థాయి వరకు మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని వైఎస్ జగన్ ఆదేశించినట్టు విశ్వ తెలిపారు.

సా(కా)రు..ఇదేం తీరు!



కార్యాలయ ప్రవేశ ద్వారం ఎదుట పార్కింగ్ చేసిన కారును శుభ్రం చేస్తున్న అటెండర్లు

రాయదుర్గంటౌన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ప్రవేశ ద్వారానికి అడ్డంగా ఎంపీడీఓ కొండన్న కారు పార్కింగ్ చేస్తుండడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు కారును కార్యాలయ అటెండర్లతో శుభ్రం చేయించడంతో ఎంపీడీఓ తీరుపై స్థానికులు, ప్రజాప్రతినిదులు చర్చించుకున్నారు. కార్యాలయ పరిపాలన విభాగంలో పనిచేసే మహిళా అటెండర్లతో కారు క్లీనింగ్ చేయించడం సరికాదని సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్ష



నిరహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం రెండో రోజూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేశారు. 10 మంది కండక్టర్లు, డ్రైవర్లు దీక్షలో కూర్చున్నారు. యూనియన్ రాష్ట్ర అసిస్టెంట్ కార్యదర్శి నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎంఎండీ షఫీ, డిపో కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019 అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలని, ఆగిన పదోన్నతులను ఇవ్వాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు



ఏపీ మోడల్ స్కూల్‌లోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన పాఠ్య, నోట్ పుస్తకాలు

రాయదుర్గంటౌన్: 2025–26 విద్యా సంవత్సరంలో మొదటి విడత ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు రాయదుర్గం స్టాక్ పాయింట్‌కు చేరాయి. జిల్లా కేంద్రం నుంచి పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ పుస్తకాలు సరఫరా అయినట్లు ఎంఈఓ–1 నాగమణి, ఎంఈఓ–2 వెంకట రమేష్ తెలిపారు. సరఫరా అయిన నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. రాయదుర్గం పరిధిలో మొత్తం 81 ప్రభుత్వ పాఠశాలల్లో 50,076 పాఠ్య పుస్తకాలకు గాను 45,120 పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరఫరా అయినట్లు తెలిపారు.